
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	175	198
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 21.4



నల్లగొండ సభకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు



ఫ్లోరైడ్ పీడను, మూసీ కాలుష్యాన్ని

తరిమికొడతాం



బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, బాలునాయక్, తదితరులు

- ప్రాజెక్టులను అడ్డుకునేవారి సంగతి ప్రజలే చూసుకోవాలి
- నల్లగొండ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లా పోరాటాల చరిత్రకు పెట్టింది పేరు.. ఈ గడ్డ పేరు తలిచినా, ఈ గాలి పీల్చినా ఒళ్లు పులకరిస్తుంది.. అలాంటి గడ్డను పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ పీడని, మూసీ కాలుష్యాన్ని తరిమికొడతాం.. సాయుధ రైతాంగ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఏ ప్రజా ఉద్యమమైనా నల్లగొండ ముందుంది.. కొండా లక్ష్మణ్‌బాపూజీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, ధర్మభిక్షం వంటి యోధులు, శ్రీకాంతాచారి వంటి బిడ్డలు నడయాడిన నేల ఇది.. ఎందరో యోధులకు నిలయమైన ఈ జిల్లాను సస్యశ్యామలం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం.. అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన పూర్తిచేసి తీరుతామని, అడ్డుకునేవారి సంగతిని ప్రజలే తేల్చాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం వస్తే నల్లగొండ జిల్లా బాగుపడుతుందని భావించారని, కానీ సమైక్య రాష్ట్రంలో కంటే గడచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే ఎక్కువ వివక్షకు గురైందన్నారు. జిల్లాలో ఎస్ఎల్‌బీసీని పదేళ్లు పూర్తిగా పక్కనబెట్టారని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఫ్లోరైడ్‌పీడతోపాటు 3.50లక్షల ఎకరాలకు సాగునీరు, ఈ ప్రాంతాలకు తాగునీరు వచ్చేదన్నారు. వివక్షకు నిరసనగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 12కు 11 సీట్లలో భారీ మెజార్టీలతో కాంగ్రెస్ నేతలను గెలిపించారని, రెండు ఎంపీ సీట్లను అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. నల్లగొండ ఎంపీగా రఘువీర్‌ను దక్షిణ భారతదేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించారని, అందుకు కృతజ్ఞతలు అన్నారు. తమ ప్రభుత్వంలో జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికే నీటిపారుదలశాఖ బాధ్యత అప్పగించామని, ఆయన నేతృత్వంలో ఎస్ఎల్‌బీసీ మొదలు చిన్న ప్రాజెక్టుల వరకు అన్నింటినీ పూర్తిచేస్తున్నారని, నిధులను కూడా గ్రీన్ ఛానల్‌లో ఉంచి విడుదల చేస్తున్నామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల, డిండి లిఫ్టు, మూసీ ప్రక్షాళన అన్ని ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేస్తామన్నారు. రీజనల్ రింగురోడ్డు నిర్మాణం చేపడతామని, నల్లగొండకు ఔటర్ రింగురోడ్డు వెంకట్‌రెడ్డి నేతృత్వంలో మంజూరైందని పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాల కూడా మంజూరైందని, త్వరలో డెంటల్ కళాశాల కూడా ఇస్తామని పేర్కొన్నారు. నల్లగొండకు ఏది అడిగితే అది ఇవ్వడం ఇందిరమ్మ ప్రభుత్వంగా తమ బాధ్యతని పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి తామంతా జట్టుగా పనిచేస్తామన్నారు.

సీఎం పర్యటన సాగుతుండగానే జీవోలు విడుదల

నల్లగొండ జిల్లాలో సీఎం పర్యటన కొనసాగుతుండగానే

మిగతా 4వ పేజీలో...

నా జన్మ ధన్యమైంది



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం జాతికి అంకితం కావడంతో తన జన్మ ధన్యమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం పర్యటన ముగిసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు తన రాజకీయ స్వప్నంగా అభివర్ణించారు. రాష్ట్రంలో దశాబ్దకాలంలో మారిన రాజకీయ పరిణామాలతో ప్రాజెక్టు నిలిచిపోతే మనసు ఎంతో వేదనకు గురైందన్నారు. అంతకుముందు పైలాన్ స్తూపావిష్కరణ వద్ద కూడా సీఎం రేవంత్‌రెడ్డికి వెంకట్‌రెడ్డి మర్యాద పూర్వక నమస్కారం చేశారు. సీఎం కూడా కోమటిరెడ్డిని అభినందిస్తున్నట్టు ప్రతి నమస్కారం చేశారు.

సభ విజయవంతంతో జోష్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయిన సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభ విజయవంతం కావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నెలకొంది. ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో ప్రతిష్ఠాత్మక బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం, యాదాద్రి పవర్‌స్టేషన్‌లో తొలి యూనిట్‌లో విద్యుదుత్పత్తి, మెడికల్ కళాశాల భవనాలను సీఎం ప్రారంభించారు. వీటితోపాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యమ చరిత్ర, ప్రగతి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను, లక్ష్యాలను సీఎం వివరించడం సభికులను ఆకట్టుకుంది. ఉదయం నుంచే భారీగా జనం నియోజకవర్గాల నుంచి తరలివచ్చి కూర్చున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాలు ప్రారంభం కాగానే కార్యకర్తలు చప్పట్లతో కేరింతలు కొట్టారు. జిల్లా వ్యాప్తంగా జనసమీకరణ చేయడంతో నల్లగొండ పట్టణం కిక్కిరిసింది. అన్ని రోడ్లు వాహనాలతో నిండిపోయాయి. పట్టణంలో నలువైపులా, అన్ని రహదారులను సీఎం స్వాగత ఫ్లెక్సీలతో నింపేశారు. సీఎం ప్రసంగం యావత్తూ జిల్లా గొప్పదనాన్నిచాటుతూ సాగడంతో పాటు, జిల్లాకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటడం సభికుల్లో చర్చకు దారితీసింది. జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని, తమ పార్టీని ఆదరించిన ఈ జిల్లా రుణం తీర్చుకునేలా పనిచేస్తామని సీఎం సహా మంత్రులు ప్రకటించారు. మొత్తంగా సభ ఘనంగా జరగడం, జనం భారీగా హాజరవడంతో మంత్రి, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా కనిపించారు. ఇదిలా ఉండగా, విజయోత్సవ సభలో నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి తన ఆటపాటలతో అలరించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై, మంత్రి వెంకట్‌రెడ్డిపై ఆయన పాడిన పాటలు ఉత్సాహపరిచాయి.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈ నిబంధనలు

పాటించాల్సిందే

- పురుగులు ఉన్న బియ్యంతో వంట చేస్తే చర్యలు
- గురుకులాలు, పాఠశాలలు, హాస్టళ్లకు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



మోత్కూరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి వంటసిబ్బంది పాటించేలా ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీచేసింది. గురుకులాలు, కస్తూర్బా, హాస్టళ్లు, పాఠశాలల్లో భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. రాష్ట్రంలో పలు చోట్ల కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో పభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వంట సిబ్బంది నిబంధనలు పాటించేలా చూడాలని ఆయా పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది.

నిబంధనలు ఇవే...

- ఆహార పదార్థాలను తేమ లేని చోట, పొడి ప్రదేశంలో భద్రపర్చాలి. వంట గది ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలి.
- వంట చేసేటప్పుడు బియ్యం, ఉప్మారవ్వలో పురుగులు, బూజులాంటివి ఉంటే వాటితో వంట చేయకూడదు.
- కుళ్లిపోయిన, పుచ్చులు ఉన్న కూరగాయలతో కూరలు వండరాదు.
- కూరగాయలు తరిగే చాకులు, చాక్‌ప్యాడ్‌లు ఎప్పటికప్పుడు కడిగి శుభ్రం చేసుకోవాలి. కిచెన్‌లో వ్యర్థాలను ఏరోజుకారోజు వెంటనే తొలగించాలి.
- భోజనానికి అవసరమైన సరుకుల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండే సరుకులను నెలకోసారి, త్వరగా పాడయ్యే సరుకులను వారంలో మూడు సార్లు ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలి. కాంట్రాక్టరు నుంచి నాణ్యత లేని సరుకులు తీసుకోరాదు.
- వంటలకు రక్షిత మంచినీటిని వాడాలి. ఓవర్ హెడ్ ట్యాంకులు 15 రోజులకు ఒకసారి, సంప్‌లు నెలకు ఒకసారి శుభ్రం చేయించి, రిజిస్టర్‌లో రాయాలి.
- వంట సిబ్బంది వెంట్రుకలు రాలకుండా తలకు క్యాప్ ధరించాలి. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. మాస్కులు ధరించాలి. వంట సిబ్బంది సమయ పాలన పాటించాలి.
- మధ్యాహ్నం, రాత్రికి వంటలు ఎప్పటికప్పుడు వేర్వేరుగా చేయాలి
- ప్రిన్సిపాల్, డ్యూటీ టీచర్, మెస్ ఇన్‌చార్జి భోజనం విద్యార్థులకు వడ్డించే ముందు రుచి చూడాలి.
- విద్యార్థులకు వేడి భోజనం వడ్డించాలి.
- పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో వేర్వేరుగా రెండుఫుడ్ కమిటీలు ఏర్పాటు చేయాలి.
- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లు, వంట సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

ఆసరాగా ఉంటారనుకుంటే

- అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు
- ఈత రాక ఐదుగురు యువకుల మృత్యువాత
- ప్రాణాలతో బయటపడిన ఒక యువకుడు
- భూదాన్‌పోచంపల్లి మండలంలో ఘటన



ఆసరాగా ఉంటారనుకున్న కుమారులు మృత్యువాత పడడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. అప్పటిదాకా తమతో మాట్లాడిన పిల్లలు ఇక లేరని తెలిసి, వారి తల్లిదండ్రులు తల్లడిల్లిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. భూదాన్‌పోచంపల్లి మండలంలో శనివారం కారు చెరువులోకి దూసుకెళ్లడంతో ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు.

- భూదాన్‌పోచంపల్లి, భువనగిరిటౌన్

5

ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి

చేనేత జౌళిశాఖ ఏడీ ద్వారక్



నేతన్న బీమా చెక్కును అందజేస్తున్న చేనేత జౌళిశాఖ అధికారులు

మునుగోడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళిశాఖ ఏడీ ద్వారక్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని మునుగోడులో ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. త్రిఫ్టు పథకంలో మండలానికి చెందిన 500 మంది కార్మికులకు రూ. 3.50 కోట్లు, నేతన్న బీమా పథకంలో ఒక్కొక్కరికీ రూ. 5లక్షలు చొప్పున నలుగురు కార్మికులకు రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సదస్సులో ఏడీవో గోపాల్, చేనేత కార్మిక సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు చెరుకు సైదులు, చిలుకూరు మధు, పలివెల చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గుర్రం రాందాస్, కార్యదర్శులు చెరిపల్లి రాము, కర్నాటి రాజు, గంజి నరేందర్, సత్యనారాయణ, సత్తయ్య, మారయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టులది ఉజ్వల పోరాట చరిత్ర



పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల పోరాట చరిత్ర కమ్యూనిస్టు పార్టీలదని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరంతరం ప్రజల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదన్నారు. సీపీఐ వందేళ్ల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఈ నెల 30న ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సీపీఐ పోరాటాల ఫలితంగానే నేటి పాలకులు ప్రాజెక్టుల పనులు పూర్తిచేస్తున్నారని అన్నారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేసినందుకు అభినందనలు అన్నారు. ప్రాజెక్టులో కేటాయించిన విధంగా కిష్టాపురం ఎడమ కాల్వ ద్వారా మునుగోడులోని 10 గ్రామాలకు సాగునీరు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్ట్‌లకు అధిక నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు గురిజ రామచంద్రం, పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రావణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, ఆర్.అంజయ్యచారి, బొల్గురి నర్సింహ, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జూలకంటి రంగారెడ్డి

సమస్యలు పరిష్కరించండి

సీఎంకు జూలకంటి వినతి

దామరచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి వినతిపత్రం అందజేశారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో డంప్‌యార్డులు జనావాసల మధ్య ఉండడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. వాటిని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, పరిశ్రమలతో భూములు కోల్పోయిన వారికి తక్షణమే ఉద్యోగాలు కల్పించి దామరచర్ల మండలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

మహిళల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

చిట్యాల, నల్లగొండ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండా అనురాధ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌తో పాటు నల్లగొండ మండలం కొత్తపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం 'ఆడపిల్లల భద్రత-మనందరి బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయలలో భాగమన్నారు. యువత ఆడపిల్లలకు రక్షణగా నిలవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆడపిల్లల భద్రత మనందరి బాధ్యత అని అన్నారు. యువతీ యువకులు సరైన అవగాహన లేక, సమాజంలో వస్తున్న పరిస్థితులు అర్థం చేసుకోలేక పక్కదారి పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఉపాధ్యాయులు పద్మజ, మంజుల, సైదానాయక్, శ్రీనివాస్, శైలజ, ఉమాదేవి, కవిత, నిర్మల, ప్రినిపాల్ చంద్రశేఖర్, సైదులు, కళావతి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ మండలంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ

ఎస్‌ఎల్‌బీసీని సంపూర్ణంగా పూర్తిచేస్తాం


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

● ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నల్లగొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగ మార్గాన్ని సంపూర్ణంగా పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నల్లగొండ పట్టణ శివారు ఎస్‌ఎల్‌బీసీలోని రాజీవ్ ప్రాంగణంలో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, పదేళ్ల పాటు పాలన చేసిన బీఆర్‌ఎస్ ఏ ఒక్క ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేదని విమర్శించారు. నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకంతో పాటు బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఏ ఒక్కరోజు కూడా ప్రాజెక్టులపై రివ్యూ చేయలేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సంవత్సరానికి ఒక కిలోమీటర్ సొరంగమార్గం తవ్వినా పూర్తిఅయ్యేదన్నారు. ఈ సంవత్సర కాలంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నుంచి 800మెగావాట్ల విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా ఉండేలా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. ఈ బహిరంగ సభలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ్మ, ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠీ, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, పద్మావతి ఉత్తమ్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్, మందుల సామేల్, బీఎల్‌ఆర్, గుత్తా అమీత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం : ఉత్తమ్


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం వల్లనే ఏ ప్రాజెక్టు పూర్తి కాలేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎస్‌ఎల్‌బీసీలోని రాజీవ్ ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ హయంలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు కెటాయించి పూర్తి చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుకు సంబంధించి తొమ్మిదిన్నర కిలోమీటర్ల సొరంగాన్ని దేశ విదేశాల నుంచి తీసుకవచ్చిన అత్యాధునిక మిషన్‌ల ద్వారా పూర్తి చేస్తామన్నారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు కింద ఈ ఆరునెలలో 50వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తామని, మరో సంవత్సరంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బ్రాహ్మణ వెల్లెంల కింద నకిరేకల్ నియోజకవర్గంలో 60వేల ఎకరాలు, నల్లగొండ నియోజకవర్గంలో 25వేల ఎకరాలు, మునుగోడు నియోజకవర్గంలో 12వేల ఎకరాలు, తుంగతుర్తి నియోజకవర్గంలో 3వేల ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ, బునాది కాని కాల్వల పూర్తికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. లిఫ్టుల మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందిస్తామని తెలిపారు.

పదేళ్లు విధ్వంసం చేసిన బీఆర్‌ఎస్

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

గత పది సంవత్సరాల పాటు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని దీంతో రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకపోయిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో 365రోజులు 24గంటలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తనను ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ప్రజలు గెలిపించారన్నారు. ముఖ్యంగా నల్లగొండ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్‌ఎల్‌బీసీని 65శాతం పూర్తి చేశామన్నారు. అదేవిధంగా బ్రాహ్మణ వెల్లెంలను 75శాతం పూర్తి చేశామని అయితే అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ తనపై కోపంతో బ్రాహ్మణ వెల్లెంలకు నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును రెండు సంవత్సరాలలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టు పూర్తి కానుందని అందుకే ఈ ప్రాజెక్టుకు ఆర్‌ఆర్ అని పేరు పెట్టుకున్నాను అన్నారు. 2014 సంవత్సరంలో కుర్చీ వేసుకొని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి కూలీపోయే కాళేశ్వరం కట్టాడని ఎద్దేవా చేశారు. కనగల్, తిప్పర్తి మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరు చేశామని అన్నారు. మూసీ ప్రాజెక్టుతో అనేకమంది రోగాల భారిన పడుతున్నారని, ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పక్షాళన చేయనున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల గురించి మాట్లాడటం సమయం వృధా అని అన్నారు.

యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

దామరచర్ల మండలం వీర్లపాలెంలో మంత్రులతో కలిసి ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


థర్మల్ ప్లాంట్‌లోపల పరిశీలిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

దామరచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ కోతల నివారణే లక్ష్యంగా నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టిన యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-2ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి ప్రారంభించారు. ఈ విద్యుత్ పరిశ్రమను జాతికి అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కాగా యూనిట్-2ను ప్రారంభించేందుకు అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భారీ బందోబస్తు నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పరిశ్రమలోని హెలిప్యాడ్ వద్ద 4.10గంటలకు పరిశ్రమకు చేరుకున్నారు. 4.20గంటలకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన పైలాన్ వద్దకు చేరుకోని దాన్ని ఆవిష్కరించారు. అనంతరం 4.30గంటలకు యూనిట్-2 ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. అనంతరం అధికారులతో కలిసి ఆయన గ్రూప్ ఫొటో దిగారు. పరిశ్రమలో 40 నిమిషాలు ముఖ్యమంత్రి గడిపారు. పరిశ్రమలో జరుగుతున్న పనులు, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వివిధ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలోని యంత్రాలను ఆయన మంత్రులతో కలిసి పరిశీలించారు. అనంతరం 4.50గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకొని హెలికాప్టర్ ద్వారా తిరిగి నల్లగొండకు బయలుదేరి వెళ్లారు. ఆయనకు కళాకారులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. దామరచర్ల నుంచి పరిశ్రమ వరకు సుమారు 2వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు. 300 మందికి మాత్రమే స్థానికులకు గ్యాలరీలోకి అనుమతించారు. ఆయన వెంట శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, టీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, సీతా సమ్మయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీహార్ వెళ్తావా... ఇక్కడే ఉంటావా : సీఎం


విద్యార్థులతో కలిసి బేంచిలపై కూర్చున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్, దామోదర, మండలి చైర్మన్ గుత్తా


నల్లగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో సుమారు రూ.275 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. మంత్రులు, అధికారులతో కలిసి వైద్య కళాశాలకు చేరుకున్న ముఖ్యమంత్రి కళాశాల భవనాన్ని, తరగతి గదులను రిమోట్ ద్వారా ప్రారంభించారు. లెక్చరర్ హాల్‌లోకి వెళ్లి వైద్య విద్యార్థులకు వైట్ కోట్స్ పంపిణీ చేశారు. నూతన వైద్య కళాశాలలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, మంత్రులు వెళ్లి విద్యార్థులతో కలిసి బెంచీలపై కూర్చున్నారు. ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థిని చందు, ముఖ్యమంత్రితో ముఖాముఖి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను నిర్మిస్తూ అందిస్తున్న వసతులు, సేవలపై ఆనందంగా ఉందని వివరించింది. తాను బీసీ గురుకుల పాఠశాలలో, కళాశాలలో చదివానని, వైద్య విద్య సైతం ప్రభుత్వ వైద్య కళాశాలలోనే చదువుతున్నానని, నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో లైబ్రరీ, తరగతి గదులు, అన్ని సౌకర్యాలు బాగున్నాయని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి చేస్తోందని కృతజ్ఞతలు తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన విద్యార్థి ప్రశాంత్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ ఆల్ ఇండియా కోటాలో తనకు నల్లగొండ కళాశాలలో సీటు వచ్చిందని, ఇక్కడ అన్ని సౌకర్యాలు బాగున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు బాగున్నాయని చెప్పాడు. 'వైద్య విద్య తర్వాత బీహార్ వెళతావా, ఇక్కడే ఉంటావా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడగగా, తెలంగాణలోనే ఉంటానని ప్రశాంత్‌కుమార్‌సింగ్ బదులిచ్చాడు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సు ఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ


సీఎం కప్ ప్రారంభ పోటీలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రులు, ఎమ్మెల్యేలు

ఉత్సాహంగా సీఎం పర్యటన


బి వెల్లెంల ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగుతున్న అర్చకులు



కృష్ణమ్మకు దండం పెడుతున్న మహిళ, పొలంలోనే భోజనం చేస్తూ..

సీఎం పర్యటనతో ముందస్తు అరెస్టులు

నల్లగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జిల్లాలో నిర్వహించిన సుడిగాలి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గత రాత్రి నుంచే బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. పలువురిని హౌస్ అరెస్టు చేయడంతో పాటు మరికొందరిని ఇతర పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీలో ఉన్న రాజీవ్ ప్రాంగణం సభకు ప్రభుత్వం ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి డిసెంబరు 7వ తేదీతో సంవత్సరం కావడంతో నల్లగొండలోనే వేడుకలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తొలుత ఈ సభను ఎన్జీ కళాశాలలో నిర్వహిస్తామని భావించినప్పటికీ హెలికాప్టర్‌లో ప్రయాణం దృష్ట్యా మెడికల్ కళాశాలను ప్రారంభించి జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాలకు చేరుకోవడానికి సమయభావం, ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో మెడికల్ కళాశాల భవనం సమీపంలోని 25ఎకరాల స్థలంలో సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు భారీగా జనం తరలిరావడం కనిపించింది. చీకటి కావడంతో హెలికాప్టర్‌లో ప్రయాణించే వీలు కాకపోవడంతో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు రోడ్డు మార్గం గుండా హైదరాబాద్ వెళ్లారు. దీంతో సీఎం వెళ్లడం కోసం చాలా సేపు పోలీసులు రోడ్లపైనే ప్రజలను నిలిపివేయడంతో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సమయం పట్టింది.


కనగల్‌లో బీఆర్‌ఎస్ నాయకులను ముందుస్తు అరెస్టు చేస్తున్న పోలీసులు

బీ.వెల్లెంల 'ఉదయ సముద్రం' జాతికి అంకితం


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంత రైతాంగం ఆశగా ఎదురుచూస్తున్న బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం ఎట్టకేలకు జాతికి అంకితమైంది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ. వెల్లెంలలో నిర్మించిన బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. హైద్రాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా వచ్చి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి పైలాన్ వరకు చేరుకున్న సీఎం, మంత్రులకు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత పైలాన్ ప్రాంగణంలోనే గణపతి, వేదాశీర్వచన పూజలనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ్మ, స్థానిక ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన ఇతర ఎమ్మెల్యేల సమక్షంలో పైలాన్ వద్ద ప్రాజెక్టు శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఎడమ కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం రిజర్వాయర్ సిస్టర్న్‌పైకి చేరుకున్న సీఎం రెండు పంప్‌మోటార్ల ద్వారా రిజర్వాయర్‌లోకి దుముకుతున్న కృష్ణవేణికి సారెచీర సమర్పించి పుష్పాలతో జలహారతి పట్టారు. ప్రాజెక్టు పూర్తిచేయడం కోసం పట్టువదలని విక్రమార్కుడిలా కృషిచేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా దామరచర్లకు పయనమయ్యారు. ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు కాగా సీఎం పర్యటన ప్రశాంత ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు మందుల సామేలు, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, టీచర్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, నేతి విద్యాసాగర్, గుత్తా అమిత్‌రెడ్డి, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేతలు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ పీడను, మూసీ కాలుష్యాన్ని తరిమికొడతాం

(5వ పేజీ తరువాయి)

మరోవైపున జిల్లాకు వివిధ పథకాలకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. జిల్లాలో ఐదు కీలకమైన రోడ్లకు రూ.204కోట్లు మంజూరు చేశారు. నల్లగొండలోని లతీఫ్ సాహెబ్ గుట్టపైకి ఘాట్‌రోడ్డుకు, బ్రహ్మంగారి మఠం శివాలయం రోడ్డుకు రూ.140కోట్లు, అనిశెట్టిదుప్పలపల్లి-ఖాజీరామారం రోడ్డు, నల్లగొండ-నకిరేకల్ పీడబ్ల్యూడీ పజ్జూరు రోడ్ల విస్తరణకు రూ.20కోట్లు, సాగర్‌రోడ్డు నుంచి కనగల్‌కు రూ.14కోట్లు, చర్లపల్లి నామ్ రోడ్డు నుంచి పిట్లంపల్లికి రూ.16కోట్లు, నార్కపల్లి నుంచి మంద్ర రోడ్డు విస్తరణకు రూ.14కోట్లు మంజూరు చేశారు. అదేవిధంగా దామరచర్ల నామ్ రోడ్డు నుంచి యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ వరకు నాలుగు లేన్ల నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.236కోట్లు మంజరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉత్సాహంగా పాల్గొన్న నేతలు

సీఎం పర్యటనలో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నేనావత్ బాలూనాయక్, వేముల వీరేశం, మందుల సామేలు, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, ఉత్తమ్‌పద్మావతి, కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, కార్పొరేషన్ల చైర్మన్లు పటేల్ రమేష్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, అద్దంకి దయాకర్, పున్నాకైలాష్‌నేత, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ప్రయాణించిన హెలికాప్టర్ నల్లగొండలోని సభాస్థలికి సాయంత్రం 5.20గంటలకు చేరుకొంది.

● హెలికాప్టర్ నుంచి దిగిన సీఎం, మంత్రులు మెడికల్ కళాశాలను ప్రారంభించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

● సాయంత్రం 6.12గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సభను ఉద్దేశించి ప్రసంగం ప్రారంభించి సాయంత్రం 6.50గంటలకు ముగించారు.

● గతానికి భిన్నంగా ఈసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన తర్వాత మంత్రులు మాట్లాడారు.

● జిల్లా నలుమూలల నుంచి బస్సులు, లారీలు, డీసీఎంలలో ప్రజలు తరలివచ్చారు.

● సభా ప్రాంగణం కిక్కిరిసి పోవడంతో సీఎంతో పాటు మంత్రులు ఉత్సాహంగా కనిపించారు.

● ట్రాఫిక్ జామ్‌తో రోడ్లపై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎర్పడ్డాయి.

● పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

● ట్రాఫిక్ క్లియరెన్స్‌కు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

● రాజీవ్ ప్రాంగణంలో ప్రజలకు మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్‌లు, బిస్కెట్లు ఇచ్చారు.

● వీఐపీ, వీవీఐపీ పాస్‌లను ప్రత్యేకంగా అందించారు.

● స్టేజీపైన కూర్చోనే వారికి ప్రత్యేకంగా పాస్‌లు ఇచ్చారు. వారి దగ్గర పాస్‌లను చూసి లిస్టులో పేర్లు ఉన్న వారిని మాత్రమే వేదికపైకి పంపారు.

● నల్లగొండ, (ఆంధ్రజ్యోతి).

సీఎం పర్యటన సాగిందిలా..

● షెడ్యూల్ ప్రకారం 2.25గంటలకు రావాల్సిన సీఎం 3.10 గంటలకు వచ్చారు

● 3.15 గంటలకు హెలిపాడ్ నుంచి పైలాన్ స్థూపం వరకు చేరుకున్నారు.

● హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ఉత్తమ్, దామోదర రాజనర్సింహ్మకు మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు

● వేద పండితుల పూర్ణకుంభ స్వాగతం అనంతరం 3.21 గంటలకు పైలాన్ వద్ద స్థూపాన్ని ఆవిష్కరించారు

● 3.29 ని.లకు ఎడమ కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు

● 3.33 ని.లకు రిజర్వాయర్ కట్టపై సిస్టర్న్ వద్దకు చేరుకుని కృష్ణమ్మకు సారెచీరె సమర్పించారు

● 3.45 ని.లకు దామరచర్లకు హెలికాప్టర్‌లో పయనమయ్యారు.

● నల్లగొండ, (ఆంధ్రజ్యోతి).

సీఎం కప్ 2024 పోటీలు ప్రారంభం

నల్లగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు అన్ని గ్రామాల్లో సీఎం కప్ మొదటి అంచె ఘనంగా ప్రారంభమైంది. నల్లగొండ పట్టణంలో జరిగిన ప్రజా పాలన ముగింపు వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఈ పోటీలను లాంచనంగా ప్రారంభించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ఈ పోటీలు పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో స్పోర్ట్స్ అథారిటీ అధికారిక గీతాన్ని కూడా ఆయన ప్రారంభించారు. పోటీల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్క క్రీడాకారుడి సమాచారాన్ని సంక్షిప్తం చేసి భవిష్యత్తు అవసరాలకు వినియోగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఒక ఏడాదిలోనే అభివృద్ధి సాధించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఉన్నారు.

పోలీసులు, ఆహార తనిఖీ అధికారుల మధ్య వాగ్వాదం

నార్కట్‌పల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బీ.వెల్లెంల పర్యటనలో పోలీసులు-ఆహార తనిఖీ అధికారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పరస్పరం వ్యక్తిగత దూషణలు చేసుకునే స్థాయికి వెళ్లింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంలలో నిర్మించిన ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం జాతికి అంకితం చేయడంతో పాటు, కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు పర్యటించారు. ఇందులో భాగంగా హెలికాప్టర్‌లో సీఎం, ఇతర మంత్రులు వస్తుండటంతో బీ.వెల్లెంల రిజర్వాయర్ కట్ట దిగువనే హెలిపాడ్ ఏర్పాటు చేశారు. అయితే హెలిపాడ్ వద్ద రంగారెడ్డి జిల్లా వికారాబాద్ కు చెందిన సీఐ క్రాంతికుమార్ ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. హెలిప్యాడ్ ప్రాంగణంలో సీఎం ఇతర మంత్రుల కోసం ఓ బస్సులో అల్పాహారం స్నాక్స్ పండ్ల వంటి ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. అయితే వాటిని తనిఖీ చేసేందుకు వాహనంలో సొల్యూషన్లతో ఆహార తనిఖీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారి వీ. జ్యోతిర్మయి, నల్లగొండ అధికారి స్వాతి తమ సిబ్బందితో హెలిపాడ్ ఆవరణలో ఉన్న బస్సు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వాహనం తనిఖీ చేసిన తర్వాతే హెలిప్యాడ్ వద్దకు వెళ్లాలని తనిఖీ సిబ్బంది వచ్చేదాకా ఆగాలని సీఐ క్రాంతికుమార్ అన్నారు. క్రాంతికుమార్‌తో పాటు అక్కడ బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుళ్లు, ఆహార తనిఖీ అధికారులు జ్యోతిర్మయి, స్వాతిల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుని వ్యక్తిగణ దూషణలు చేసుకునే స్థాయికి వెళ్లింది. మీ ప్రవర్తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ ఇరువురు పరస్పరం రుసరుస లాడుకున్నారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారుల సూచనతో తనిఖీ అనంతరం హెలిపాడ్‌లోకి అనుమతించారు.

ఆనందమైనా.. దుఃఖమైనా నాకు పాటే..

ఎన్నో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించాయి



వృత్తిలో నిరంతరం బిజీగా ఉన్నా సంగీతంపై తనకున్న మక్కువ మాత్రం వీడడంలేదు. ఎక్కడ పాటల పోటీలు ఉన్నా తన ప్రతిభ చూపుతూ ప్రశంసలు పొందుతున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మునిసిపల్ బిల్ కలెక్టర్ ఉపేంద్రచారి వృత్తిని బాధ్యతగా చేస్తూనే గానామృతాన్ని పంచుతున్నాడు. స్థానికులకు జూనియర్ యేసుదాసుగా సుపరిచితం. ఆనందమైనా, దుఃఖమైనా తనకు పాటే అంటున్నారు.


(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన గుండెపురి ఉపేంద్రాచారి మునిసిపల్ బిల్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత మెయిన్‌రోడ్డుపై ఉన్న గృహాలకు సంబంధించి ఇంటి పన్నులతో పాటు ప్రభుత్వ పథకాలను అందించేలా పనిచేస్తున్నాడు. అయితే ఆయనకు పాటలు పాడటం అంటే ఎంతో ఇష్టం. ఖాళీ దొరికినప్పుడల్లా పాటలు పాడుతూ పలువురిచేత ప్రశంసలు పొందుతున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన సుమారు 12కు పైగా పాటల పోటీల్లో పాల్గొన్నాడు. అదేవిధంగా 30కి పైగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. సినీ ప్రముఖులు తనికెళ్ల భరణితో పాటు పలువురు ప్రముఖుల చేత బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు, ఎంపీల నుంచి అవార్డులను గెలుచుకున్నారు. తనకు ఇష్టమైన యేసుదాసు, బాలు, ఘంటసాల పాటలను అమితంగా ఇష్టపడుతూ తన గానామృతంతో ప్రజలను సంగీత ప్రపంచంలో ఆనందింపజేస్తున్నాడు. 'తెలవారనీదే సామీ..', అల్లుడు గారు సినిమాలోని ముద్దబంతి పువ్వులో మూగబాసలు పాటలు తనను జూనియర్ యేసుదాసుగా ప్రాచుర్యం చేశాయని తెలిపారు. పుణ్యభూమి నాదేశం పాటకు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ నీలం సహాని అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందజేశారని, అదే తన మొదటి అవార్డుగా తెలిపారు.

ఉదయం వృత్తి, సాయంత్రం పాటలు

సూర్యాపేట మునిసిపాలిటీతో పాటు గ్రామపంచాయతీ కలిపి 23 ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా ఉపేంద్రాచారి పనిచేస్తున్నాడు. ఇంటి పన్నుల వసూళ్లలో సైతం ముందువరుసలో ఉంటున్నాడు. ఉదయం విధులు నిర్వహించి సాయంత్రం జిల్లా కేంద్రంలోని బాలభవన్ ఆవరణలో శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటు తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నాడు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఘంటసాల రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో సైతం విజేతగా నిలిచాడు.

● సంగీతం నా జీవితంలో భాగం



రోజువారి కార్యక్రమాలు ఎన్ని ఉన్నా, కొంత సమయాన్ని సంగీతానికి ప్రాధాన్యమిస్తా. చేసే పనిలో సైతం సంగీతంతో ముడివేసి పనిని ఇష్టంగా మలుచుకుంటా. అవార్డు, ప్రశంసల కన్నా నా పాటంటే నాకు ఇష్టం. బాధ కలిగినా, సంతోషం కలిగినా పాటతోనే వ్యక్తం చేస్తుంటా. పాట నా జీవితంలో భాగంగా మారింది.

ఉపేంద్రాచారి, గాయకుడు, బిల్‌కలెక్టర్

ఆసరాగా ఉంటారనుకుంటే..

● అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు ● ఈత రాక మునిగి ఐదుగురు మృత్యువాత ● జలాల్‌పూర్ గ్రామంలో సంఘటన





ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, భువనగిరి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబాలకు ఆసరాగా ఉంటారనుకుంటే.. ఆ కుటుంబాలకు తీరని శోకం మిగిల్చిన ఘటన శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో జరిగింది. ఈత కల్లు తాగి జల్సా చేద్దామని కారులో ఇంటి నుంచి భూదాన్‌పోచంపల్లికి బయల్దేరిన యువకులు మృత్యువాత పడ్డారు. అతి వేగంగా పయనిస్తూ అదుపు తప్పిన కారు యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువులోకి దూసుకెళ్లింది. కారులో పయనిస్తున్న ఆరుగురిలో ఐదుగురు మృతి చెందగా ఒక యువకుడు మాత్రమే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామ శివారులోని చెరువుకట్టపైన శనివారం తెల్లవారు జామున 4:30గంటలకు ఘోర ప్రమాదం జరిగింది. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ రాములు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..

ఈత కల్లు తాగేందుకు పయనమై..

చలికాలం.. ఈత కల్లు తాగి వద్దామని ఆ యువకులు భూదాన్‌పోచంపల్లికి కారులో కొత్తగూడెం నుంచి బయల్దేరారు. కారు అతి వేగంగా నడపడంతో జలాల్‌పూర్ గ్రామశివారులోని చెరువుకట్ట వద్ద గల మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. రోడ్డుపక్కన చెరువుకు అడ్డుగా ఉన్న రాతి కడీని కారు బలంగా ఢీకొట్టడంతో పల్టీ కొట్టి చెరువులోకి దూసుకెళ్లింది. తీగుల్ల వంశీ కారు నడుపుతున్నాడు. అతని పక్కనే మెడబోయిన మణికంఠ కూర్చున్నాడు. వెనుక సీట్లో విఘ్నేష్, అక్షయ్ అలియాస్ బల్లు, వినయ్, హర్షవర్ధన్ కూర్చున్నారు. వీరిలో మణికంఠకు మాత్రమే ఈత రావడంతో అతడు కారు అద్దాలు పగల కొట్టుకొని ఈదుకుంటూ బయటకు వచ్చి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అతని ద్వారా పోలీసులు సమాచారం సేకరించారు. చలికి, చెరువులో పూర్తిగా తడిసి ఉన్న అతన్ని పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

సమాచారం అందుకున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారును ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు లాగారు. అప్పటికే కారులో ఐదుగురు యువకులు మృతిచెంది ఉన్నారు. మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకటొరెడ్డి పంచనామా నిర్వహించారు. ఏసీపీ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

సూచిక బోర్డులు లేవని గ్రామస్థుల ఆందోళన

జలాల్‌పూర్ చెరువుపై ఉండే రోడ్డులో మూలమలుపు వద్ద గతంలోనూ అనేక ప్రమాదాలు జరిగాయి. కనీసం సూచిక బోర్డులు కూడా లేవని, మూలమలుపు ప్రమాదంగా ఉండడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చేశారు. వెంటనే రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఏసీపీ మధుసూదన్‌రెడ్డి గ్రామస్థులతో మాట్లాడారు. త్వరలో ఆర్అండ్‌బీ శాఖ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత ఆర్అండ్‌బీ శాఖాధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి హామీ లభించడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

కుటుంబాల్లో విషాదం

కుటుంబాలకు ఆసరాగా ఉంటార నుకునే లోపు ఆ కుటుంబాలకు పిడుగులాంటి వినాల్సి వచ్చింది. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో జలాల్‌పురం గ్రామ చెరువులో కారు దూసుకెళ్లిన ఘటనలో మృత్యువాత చెందిన ఐదుగురు యువకుల కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది. సంఘటన జరిగిన తర్వాత ఆ యువకుల మృతదేహాలను అంబులెన్స్‌లో భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. కొద్ది సేపటి తర్వాత మృతుల కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. తమకు ఆసరాగా ఉంటార నుకునే లోపే తీరని దుఖంలో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు వేర్వేరు అంబులెన్స్‌ల్లో మృతదేహాలను హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని సొంత ఇళ్లకు తీసుకెళ్లారు.

పక్కనే ఉన్నా అమ్మ.. వస్తున్నా..

కారు ప్రమాదంలో మృత్యువాత పడిన హర్ష ర్యాపిడో పనిచేస్తూ తల్లికి అండగా ఉంటున్నాడు. రాత్రి ర్యాపిడో చేస్తానని బయటకు వెళ్లిన హర్ష.. తెల్లవారుజామున 2 గంటలకు తల్లికి ర్యాపిడోలో వచ్చిన 500 ఫోన్‌పే చేశాడు. అమ్మా పక్కనే ఉన్న ఇంటికి వస్తున్నా.. అని చెప్పి ఫ్రెండ్స్ కారులో భూదాన్‌పోచంపల్లికి వెళ్లి.. అంతులేని లోకాలకు చేరాడు.

అందరూ యువకులే..

జలాల్‌పూర్ చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు మృతిచెందగా మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు. ఆరుగురు ప్రాణస్నేహితులు కావడంతో పాటు అందరూ హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నివసిస్తున్నవారే. అందరివి పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలే.

మృతుల్లో ముగ్గురు ఉమ్మడి జిల్లా యువకులు.

రామన్నపేట మండలం బోగారానికి చెందిన జెల్ల వెంకటేశం, వనజ దంపతులు ఆర్‌టీఏ ఏజెంట్‌గా జీవనం సాగిస్తూ హైదరాబాద్ ఎల్బీనగర్‌లో స్థిపడగా వారి రెండో కుమారుడైన ఇంజనీరింగ్ విద్యార్థి జెల్ల వినయ్(21) మృతిచెందాడు. మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి వీరమల్ల సత్యనారాయణ, లక్ష్మీ దంపతులు కూడా ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీలో నివాసముంటు న్నారు. వారి చిన్న కుమారుడు వీరమల్ల జ్ఞానేశ్వర్(20) మృత్యువాత పడ్డాడు. వలిగొండ మండలం సంగెం గ్రామానికి చెందిన నర్సింహాచారి ఎల్బీనగర్‌లో వడ్రంగి కార్మికుడిగా స్థిరపడ్డాడు. వారి చిన్నకుమారుడు అక్షయచారి(20) మృతిచెందారు. ఎల్బీనగర్‌లో స్థిరపడిన సిద్దిపేట జిల్లా ముగులు మండలం బాడమైలారం గ్రామానికి డ్రైవర్ తీగుల్ల శంకర్‌గౌడ్ కవిత దంపతుల చిన్నకుమారుడు తీగుళ్ల వంశీగౌడ్(23), ఎల్బీనగర్ శివగంగ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఇంద్రపల్లి శ్రీనివాస్ మధురవాణి దంపతుల కుమారుడు హర్షవర్ధన్(22) మృతిచెందాడు.

మిన్నంటిన రోదనలు

మృతిచెందిన ఐదుగురు యువకుల కుటుంబసభ్యుల రోదనలతో ఆస్పత్రి దద్దరిల్లింది. చిన్నప్పటి నుంచి తమ పిల్లల జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. మార్చురీ గది నుంచి వెలుపలికి తీసుకువచ్చిన కొడుకుల మృతదేహాలను చూస్తూ తల్లడిల్లారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్నానాయక్ పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించగా మృతుల కుటుంబాలను మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పరామర్శించారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	585.40
టీఎంసీలు	298.5890
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	8,144
విద్యుత్ కేంద్రం ద్వారా	16,727
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	32,244క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.51 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.68 అడుగులు
టీఎంసీలు	4.38
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	215.84 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	215.84 క్యూసెక్కులు

మహిళ అదృశ్యం



సంధ్య (ఫైల్)

హుజూర్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఓ మహిళ శుక్రవారం కనిపించడం లేదు. స్థానిక ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్‌కు చెందిన జర్పుల సంధ్య (22)కు మట్టంపల్లి మండలం పాత దొనబండ తండాకు చెందిన బానోతు కోటేశ్వర రావుతో 2024 ఏప్రిల్‌లో వివాహం జరిగింది. సంధ్య పట్టణంలోని అనుశ్రీ ఇనిస్టిట్యూట్‌లో కొన్ని రోజులుగా బ్యూటీషియన్ ఫ్యాకల్టీగా పని చేస్తోంది. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి పోయింది. భర్త కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈ ఉపాధ్యాయులు మాకు అవసరమా?

» విధులకు అలస్యంగా.. చెప్పకుండా సెలవు ప్రభుత్వ ఉపాధ్యాయుల నిర్వాకం » తల్లిదండ్రుల ఆగ్రహం.. ఎంఈవోకు ఫిర్యాదు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలకు సరిగా చదువు చెప్పని ఈ ఉపాధ్యాయులు మాకు అవసరమా? అంటూ మల్లాపురం గ్రామానికి చెందిన పలువురు తల్లిదండ్రులు ఎంఈవోను నిలదీశారు. శనివారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం ఎంపీపీఎస్ పాఠశాల ఎదుట ఈ ఘటన జరిగింది. ఉపాధ్యాయులు శనివారం ఉదయం 10.30 నిమిషాలకు విధులకు హాజరు కాగా మరొకరు చెప్పకుండా విధులకు గైర్హాజరయ్యారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల, ఎంఈవో తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో 27 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రధానో పాధ్యాయుడు, మరో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు దానయ్య సెల వులో ఉండగా, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, మమత ఉదయం 9.05 విధు లకు హాజరు కావల్సి ఉంది. ఉపాధ్యాయులు ఎవరూ హాజరు కాకపోవడంతో విద్యార్థులు రోడ్లపై తిరుగుతుండడంతో గమనించిన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి చూడగా విషయం బయటకు వచ్చింది. ఉదయం 10.30 గంటల సమయంలో లక్ష్మారెడ్డి రాగా, మమత పాఠశాలకు రాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహంతో ఎంఈవో వెంకటయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన అజ్మాపురం కాంప్లెక్స్ హెచ్ఎం జగదీశ్వర్‌రెడ్డితో కలిసి పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో లక్ష్మారెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పాఠశాలకు సక్రమంగా రావడం లేదని తేలింది. గతంలో ఇదే మండలం మునావత్‌తండాలో పనిచేస్తున్నప్పుడు పాఠశాలకు సక్రమంగా రావడం లేదని విచారణలో తేలడంతో అప్పటి ఎంఈవో తరి రాములు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఈ విద్యాసంవత్సరం నుంచి డిప్యూటేషన్‌పై మల్లాపురం బదిలీ చేశారు. ఇక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహ రించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోను నిలదీశారు. దీంతో సదరు ఉపాధ్యాయుడు తనను క్షమించమని, మరోసారి నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చని లిఖితపూర్వకంగా ఎంఈవోకు అందజేశారు. కాగా మరో ఉపాధ్యాయురాలు మమత ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సెలవులో ఉన్నందున కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి అనుమతితో సెలవు తీసుకోవాల్సి ఉండగా, ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విషయమై ఎంఈవోను వివరణ కోరగా మమత తనకు కానీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి సెలవు అనుమతి తీసుకోకుండా పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డికి సమాచారం అందించినట్లు చెప్పారు. మమతను వేరే పాఠశాలకు పంపిస్తామని, సోమవారం నుంచి వద్దిపట్ల నుంచి మరో ఉపాధ్యాయుడిని ఇక్కడికి పంపిస్తామని ఎంఈవో వెంకటయ్య తెలిపారు. ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డికి చివరి అవకాశం ఇచ్చామన్నారు. పాఠశాల ప్రారం భమయ్యే సమయానికి ఉపాధ్యాయులు రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



విచారణ చేస్తున్న ఎంఈవో వెంకటయ్య



కొండమల్లేపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం, పట్టిక

14 లీటర్ల సారా స్వాధీనం

కొండమల్లేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో పలు తండాల్లో దేవర కొండ ప్రొహి బిషన్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. కేశ్యతండా, మేఘ్యతండా, కొండమల్లేపల్లిలో నిర్వహించిన దాడుల్లో 14 లీటర్ల సారా, 252 కిలోల బెల్లం, 40 కిలోల పటికను స్వాధీనం చేసుకొని నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐనర్సింహ, సాగర్, కృష్ణ, వేణుగోపాల్, రాము పాల్గొన్నారు.

70 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం

మర్రిగూడ : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేటతండా, అజలాపురం గ్రామంలోనాంపల్లి ఎక్సైజ్ అధికారులు శనివారం సారా స్థావ రాలపై దాడి నిర్వహించి 70లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సైదులు మాట్లాడుతూ గ్రామాలల్లో నాటు సారా బట్టీల ద్వారా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈయన వెంట నాంపల్లి ఎక్సైజ్ సిబ్బంది నాగరాజు, అశోక్ కుమార్, జానీ ఉన్నారు.

గణేష్‌నగర్ రామలింగేశ్వర ఆలయంలో చోరీ



చోరీ తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గణేష్‌నగర్‌లో శుక్రవారం రాత్రి పార్వతీ సమేత రామ లింగేశ్వర ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్ఐ లోకేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్‌నగర్ (లారీయార్డు) కాలనీలోని రామలింగేశ్వర ఆలయ ముఖద్వారం తాళాలు పగులగొట్టి ఆలయం లోపలకు ప్రవేశించి గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వర పంచ లోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. సమారు రూ.60వేల విలువైన మూడు పంచలోహ విగ్రహాలతోపాటు, శఠగోపురాన్ని దొంగిలించారు. ఆలయంలో చోరీ జరిగిన తీరును శనివారం పోలీసులు పరిశీలించారు. పూజారి వీర భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాగార్జునసాగర్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో 1978-79 పదో తరగతి విద్యార్థులు శనివారం విజయ విహార్ అతిథి గృహంలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిం చుకున్నారు.. 46 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో భారతి, పద్మజా, నాగమణి, సుబ్బలక్ష్మి, లీల, సునీత, జానకి, మహిత, విజయలక్ష్మి గీత ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థినులు



నాగార్జునకొండ మ్యూజియంలో విద్యార్థుల సందడి

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లో వారంతం శనివారం కావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలోనిలు జిల్లాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్ద ఎత్తున సాగర్ అందాలను తిలకించేందుకు సాగర్‌కు వచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, అనుపు, ఎత్తిపోతల, నాగార్జునకొండ తదితర ప్రాంతాల్లో రద్దీగా మారింది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ లాంచీలు విద్యార్థులు పెద్ద ఎతున, వెళ్లడంతో నాగార్జున కొండపై వెళ్లారు. నాగార్జునకొండకు రెండు లాంచీ ట్రిప్పులు నడిపినట్లు అధికారులు తెలిపారు.

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో 12 ప్రసవాలు

దేవరకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రభుత్వ దవాఖానాలో ఈనెల 6న ఉదయం 9 నుంచి 7వ తేదీ ఉదయం 9 గం టల వరకు 12 మందికి వైద్యులు ప్రసవాలు చేశారు, అందులో ఏడుగురికి సాధారణ, ఐదుగురికి ఆపరేషన్లు చేసినట్లు చేశారు. తల్లుల, చిన్నారులు క్షేమంగా ఉన్నారనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంగ్తానాయక్ మాట్లాడుతూ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యం అందుబాటులో ఉందని వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రతిష్ఠమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్య క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అలాగే అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్ర రీతిలో చేట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామడపంలో స్ఫటిక మూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొన సాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 33,48,944 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

ఈవో దృష్టికి దుకాణం తొలగింపు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం పరిధిలోని వైకుంఠద్వారం చెంత కొత్తగా టీ స్టాల్ ఫుట్‌పాత్ ఆక్రమించి శాశ్వతంగా నిర్మించారు. దీనిపై శనివారం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంయుక్తంగా నిరసన తెలిపి కొత్తగా వెలసిన దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ కొండపైన ఈవో ఏ. భాస్కర్ రావుకు ఇదే విషయమై వినతి పత్రం అందజేశారు. టెండరు దారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఇరు పార్టీల నాయకులు ఈవోను ఉద్దేశించి ఇరు పార్టీల నాయకులు ఆరోపించారు. మొబైల్ టీ స్టాల్ పేరుతో టెండరు దక్కించుకున్న టెండరుదారులు భక్తులు నడిచి వెళ్లే ఫుట్‌పాత్‌ను ఆక్రమించి శాశ్వత టీ స్టాల్‌ను ఏర్పరచి ఇక్కడ సిగరేట్లు కూడా విక్రయాలు జరుపుతున్నట్లు నిరసనకారులు తెలిపారు.

కాగా, వైకుంఠద్వారానికి ఇరువైపులా నిలిపిన వాహనాలు, పాత గోశాల చెట్లకింద భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు, అలాగే వైకుంఠద్వారం చెంత చిరువ్యాపారులు అడ్డుకున్నట్లు ఈవోకు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని తక్షణమే తొలగించాలని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. పాత గోశాల చెట్లకింద భక్తుల నుంచి డబ్బులు వసూలు తగదని ఈ మేరకు ఈవో తెలిపారు. భక్తుల నుంచి వాహనా పార్కింగ్ డబ్బుల వసూలు కూడా నిలిపి వేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే టెండర్‌ను రద్దు చేస్తానని హెచ్చరించారు.

తెలంగాణ తల్లి విగ్రహ మార్పును సహించం

మర్రిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలం గాణ తల్లి విగ్రహ మార్పును సహించేది లేదని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు బచ్చు రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తల్లిని పేదరాలిగా చూపడమేనా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు అని ఆయన ప్రశ్నించారు. 2006 నుంచి తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆ తల్లికి నమస్కరించి తెలంగాణ పోరులో పాల్గొన్నామని గుర్తు చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తులను చెరిపివేయాలని చూస్తుందే తప్ప తెలంగాణ అస్తిత్వాన్ని పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగానే కాంగ్రెస్ పార్టీ పెద్దల మెప్పు కోసం తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లి విగ్రహంగా మార్చుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలి ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. నాలుగేళ్ల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అవమానానికి గురైన చోటే మళ్లీ తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించడం ఖాయమని ఆయన అన్నారు.

అండర్‌పాస్ వద్ద అవస్థలు

• ఇనుపాముల అండర్‌పాస్ వంతెనలో నిలిచిన నీరు
• వాహనదారుల ఇక్కట్లు



ఇనుపాముల వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్‌లో నిలిచిన నీరు

కేతేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని ఇనుపాముల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన పెడెస్టల్ అండర్ పాస్ (పీయూపీ) ఏఎమ్మార్పీ నీటితో నిండిపోయింది. వారం రోజులుగా ఏఎమ్మార్పీ డి 49కు నీటి విడుదల కొనసాగుతుంది. ఈ నీటితో 65వ నెంబరు జాతీయ రహదారి వెంట గల స్థానిక నల్లచెరువు నిండి అలుగు పారుతోంది. చెరువు అలుగు నీరంతా అండర్ పాస్ వంతెన వద్ద గల డ్రైనేజీ నుంచి వంతెన దాటి రహదారి ఆవలి వైపునకు వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నీరంతా అండర్ పాసింగ్ వంతెన కింద చేరుతుంది. రహదారి నిర్మాణ సంస్థ జీఎమ్మార్ డ్రైనేజీ నిర్మించినా నీరు వెళ్లేలా చేయకపోవడంతో నీరంతా అండర్‌పాస్ వంతెన కింద, వంతెనకు ఇరువైపులా గల సర్వీస్ రోడ్లపైన నిలుస్తోంది. దీంతో ఈ అండర్‌పాస్ వంతెన కింద నుంచి నకిరేకల్ పట్టణానికి వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి, కొర్లపహాడ్, చీకటిగూడెం గ్రామాలతో పాటు నకిరేకల్ మండలంలోని మండలాపురం, చందుపట్ల గ్రామాలకు చెందిన వారు సైతం ఇక్కడ నుంచే నకిరేకల్ పట్టణానికి వెళ్తుంటారు. సూర్యాపేట వైపు నుంచి నల్లగొండ, హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు సైతం స్థానిక మల్లన్న గుట్ట వద్ద గల జంక్షన్‌లో మలుపు తీసుకుని ఈ నీటి నుంచి ప్రయాణిస్తూ నకిరేకల్ పట్టణానికి చేరుకుంటాయి. ఇలా నీళ్లలోంచి ప్రయాణించే క్రమంలో ద్విచక్ర వాహనదారులకు రోడ్డుపై ఉండే గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నారు. గురువారం మండలంలోని బండపాలెం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఇలాగే వాహనంతో సహా నీళ్లలో పడిపోయాడు. ఈ క్రమంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటితో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటం వల్ల నీటిలో నుంచి వాహనాలు నడపడం కష్టతరమవుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లలోంచి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా కింద పడిపోవడంతో పాటు వాహన ఇంజన్‌లోకి నీరు చేరి పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో జీఎమ్మార్ చర్యలు

అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటిని జీఎమ్మార్ సంస్థ ఒకటి రెండు రోజుల్లో తొలగించే చర్యలు తీసుకునేది. ఆరు నెలల క్రితం 65వ నెంబర్ జాతీయ రహదారి టోల్ వసూలు, నిర్వహణ బాధ్యతల నుంచి జీఎమ్మార్ తప్పుకుంది. జీఎమ్మార్ స్థానంలో ఎన్‌హెచ్‌ఏఐ నుంచి రహదారి ఓ అండ్ ఎం బాధ్యతలు తీసుకున్న సంస్థ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో చేరే చెరువు అలుగు నీటిని తొలగించే నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికైనా 65వ నెంబరు జాతీయ రహదారి నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి ఇనుపాముల గ్రామ అండర్ పాసింగ్ వంతెన కింద నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోసం టోల్‌ప్లాజా అధికారులను ఫోన్ సంప్రదించేందుకు యత్నిస్తే వారు స్పందించలేదు.

అండర్ పాస్ వద్ద ప్రమాదకరంగా నీరు

ఇనుపాముల వద్ద అండర్ పాస్ వంతెన కింద, ఇరువైపులా నిలిచే నీరు ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపై రెండు అడుగుల మేర నీరు నిలిచి ఉండటంతో రోడ్డుపై ఉండే గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు కింద పడిపోయి ప్రమాదాలబారిన పడుతున్నారు. నీరు వెళ్లేందుకు నిర్మించిన డ్రైనేజీ సక్రమంగా నిర్మించకపోవడంతో వర్షపు నీరు, చెరువు అలుగు నీరు రోడ్డు మీదకు చేరి నిలుస్తుంది. ఇక్కడ నీరు నిల్వకుండా చూడాలని టోల్‌ప్లాజా యంత్రాంగానికి, ఎన్‌హెచ్ఏఐ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

• బొజ్జ సుందర్, ఇనుపాముల

నీటి నిల్వ ఉండకుండా చూడాలి



ఇనుపాముల గ్రామం వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్ వంతెన, ఇరువైపులా సర్వీసు రోడ్ల మీదకు వర్షపు నీరైనా, ఏఎమ్మార్పీ కాల్వ నీరైనా రాకుండా చూడాలి. ఇక్కడ నిలిచే నీరు బయటకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరంతా రోడ్డుపై నిలిచి ప్రమాదకరంగా మారుతుంది. రోడ్డు నిర్వహణ సంస్థ రహదారి వెంట గ్రామాల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి.

• కానుగు యాదగిరి, ఇనుపాముల

మానవ హక్కుల వేదిక మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

నకిరేకల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఈ నెల 14, 15 తేదీలలో నిర్వహించే ఉభయ తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభల ను విజయవంతం చేయాలని హెచ్‌ఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వా మి అన్నారు. నకిరేకల్‌లో శనివారం రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆయన ఆ విష్కరించి మాట్లాడారు. భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న మానవహక్కుల హననం, బస్తర్‌లో ఆపరేషన్, కగార్ పేరుతో జరుగుతున్న ఆదివాసుల ఊచకోతలను నిరసిస్తూ మానవ హక్కుల వేదిక ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ కాశీరాం, బొమ్మకంటి కొమురయ్య, బొల్లికొండ లింగయ్య వెంకటాద్రి, వంటిపాక సుందర్, మండల కృష్ణ, బొజ్జ ఆరోగ్యం, తిరుగుడు రవి, వెంకటరమణ, సత్తయ్య, ఫయాజ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

• రెండో రోజు చేరుకున్న నిరాహార దీక్షలు
• మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు



కట్టంగూరు ఎమ్మార్వీ భవనం ముందు నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

కేతేపల్లి, శాలిగౌరారం, కట్టంగూరు, చిట్యాల, మునుగోడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ క్రమబద్ధీకరించాలని ఉద్యోగులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శనివారం రెండో రోజుకు చేరుకుంది. సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. వారికి టీపీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో క్రియాశీలకంగా వ్యవహరించే సమగ్ర శిక్ష ఉద్యోగులపై ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమగ్ర శిక్ష ఉద్యోగుల తరఫున పోరాడతామని అన్నారు.

● కేతేపల్లిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్షలకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. మద్దతు ప్రకటించిన వారిలో ఆయా సంఘాలకు చెందిన కుశలవరెడ్డి, కె.వెంకటరెడ్డి, కోట వెంకటయ్య అమరేందర్, జయసాగర్, జెల్లా రమేష్, సత్యనారాయణ, రాంప్రసాద్ ఉన్నారు. దీక్షల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మల మంజులారెడ్డి, నాయకులు బంటు రవి, ఎ.మల్లయ్య, సైదులు, రాజేందర్, సుజాత, రేవతి, ఉమాదేవి, జానకి, మరియమ్మ, నాగమణి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మెలుగురి కృష్ణ పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే 10వ తేదీన కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలిచి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కొండ చంద్రశేఖర్, బిక్షయ్య, సుజాత శేఖర్, బం డారు పరమేష్, కేజీబీవీ సీఆర్టీలు నాగమణి, లలిత, లక్ష్మి, సిబ్బంది, శోభ, నర్మద, రాములమ్మ పాల్గొన్నారు.

● కట్టంగూరులో ఎమ్మార్వీ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మురళయ్య, పుట్ట రాములు సంఘీభా వం ప్రకటించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఐతగోని సైదులు, నగేష్, రామలింగం, లక్ష్మణ్, విజయ, సుధ, యాదమ్మ, శిరీష, ఆదిలక్ష్మి, విలసిత, స్వప్న, అ శ్విని, మాధవి, సంతోషి పాల్గొన్నారు.

● చిట్యాలలో రిలే దీక్ష చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్, పీఆర్టీ యూ నాయకులు ఏశమల్ల నాగయ్య, జి.సతీష్, కె.సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ దీక్షలకు మద్దతు పలికారు.

● మునుగోడులో మండల వనరుల కేంద్రం భవనం ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు దీక్ష నిర్వహించారు. వారికి పీఆర్‌టీయూ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు యూనుస్‌పాషా, ప్రధాన కార్యదర్శులు క ళావతి, అన్నపురెడ్డి, వెంకటేష్, సత్తిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు సంకు లింగయ్య, శ్రీనివాస్, పర్యావరణ ఉద్యమ నాయకుడు జీడిమెట్ల రవీందర్ మద్దతు పలికారు. ప్రభుత్వం వారి న్యాయమైన డి మాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా ప్రచార కార్యదర్శి చందపాక నాగరాజు, బొజ్జ అంజి, సతీష్, నర్సింహ, సై దులు, ఇందిర, శైలజ, ధన లక్ష్మి, స్వాతి, భాగ్యమ్మ, ధనమ్మ, గీత, చంద్రమౌళి, వసంత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నిధులు కేటాయించడం వల్లే బ్రాహ్మణవెల్లెంల పూర్తి



కేటీఆర్‌తో రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి

నార్కట్‌పల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను నార్కట్‌పల్లి మండలానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంలలో ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అధిక నిధులు కేటాయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఫలితంగానే నేడు జాతికి అంకితమైందని అన్నారు. ఈ మేరకు మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను వారితో చర్చించారు.

ఆదర్శ పాఠశాలకు వంట గదిని నిర్మించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

కేతేపల్లి, డిసెంబరు 7: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల ఆదర్శ పాఠశాలకు వంట గదిని నిర్మించాలని పీఆర్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం నాయకులు ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆదర్శ పాఠశాలలో 408 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా వారికి మధ్యాహ్న భోజనం వంట చేయడానికి వంట గది లేకుండా పోయిందని తెలిపారు. ఆరుబయట చెట్ల కింద వంట చేయడం కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న ఆహార కలుషిత సంఘటనలకు పాఠశాలల సిబ్బందిని బాధ్యులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆదర్శ పాఠశాలలో వంటలకు ప్రత్యేకంగా గది నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ఆ వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుడిపెల్లి కుశలవరెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జెల్లా రమేష్ ఉన్నారు.

చెర్వుఅన్నారం గ్రామవాసికి ఓయూ డాక్టరేట్



రెడ్డిమల్ల శంకర్

కట్టంగూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన రెడ్డిమల్ల శంకర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎ.నర్సింగరావు పర్యవేక్షణలో జియాలజీ విభాగంలో కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలో సున్నపురాయి నిక్షేపాల అన్వేషణ, వనరుల మూల్యాంకనంపై పరిశోధన పూర్తి చేశారు. సందర్భంగా శంకర్ విదేశాల్లో జియాలజిస్టుగా పని చేసుకుంటూనే పీహెచ్‌డీ డిగ్రీ సాధించాడు. తన పరిశోధనకు సహకరించినందుకు ప్రొఫెసర్ నర్సింగరావు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించిన శంకర్‌ను గ్రామస్థులు, పరిశోధన విద్యార్థులు అభినందించారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మర్రిగూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రిస్టయన్ల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. నాంపల్లి మండలంలో శుక్రవారం రాత్రి క్రిస్టియన్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్‌కు ఆయన హాజరై మాట్లాడారు. లోకరక్షకుడైన ఏసుప్రభును ప్రార్థించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చర్చీలు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వడం లేదని, క్రిస్టియన్లు మృతి చెందితే వారిని సమాధి చేయడానికి స్థలం కొరత ఉందని క్రిస్టియన్ ఫెలోషిప్ నాంపల్లి మండల అధ్యక్షుడు ఎలిశా, కొలమన్ అన్నారు. ఈ మేరకు దీపక్ జాన్ మాట్లాడుతూ చర్చి కట్టుకోవాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుం టే కలెక్టర్ అనుమతి ఇస్తారని తెలిపారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కోనేరు ప్రభు ప్రసాద్, ప్రభుదాసు, హెబ్రా, పవన్య పాల్, ప్రకాష్, రవి కుమార్, శాలం రాజు, ఏసుపాదం, సుధాకర్, పొలిశెట్టి ప్రకాశ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నార్కట్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు సమీపంలో గల శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ సహార్చకుల యాజ్ఞికంలో జరిగిన ఈ కల్యాణతంతు వేడుకను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నూకల నర్సింహారెడ్డి, తేరటుపల్లి హనుమంతు, జయారపు రామకృష్ణ, కొండూరు వెంకటేష్, పసునూరి రమేష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో శనివారం సుబ్రమణ్యస్వామి షష్టిని పురస్కరించుకుని అర్చకులు సుబ్రమణ్యస్వామికి విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. చీరసారె ఒడిబియ్యం, బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ముఖ్యమంత్రి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



చిట్యాలలో సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

కనగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణం ఎస్ఎల్‌బీసీలో శనివారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన విజయోత్సవ సభకు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో లారీలను, డీసీఎం వాహనాలను ఏర్పాటు చేయగా కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

మర్రిగూడ: బహిరంగ సభకు మర్రిగూడ, నాంపల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. బహిరంగ సభకు వృద్ధులు సైతం నల్లగొండకు హుషారుగా సభకు హాజరయ్యారు.

చిట్యాల: నల్లగొండలో జరిగిన సీఎం బహిరంగ సభకు చిట్యాల మునిసిపాలిటీ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. వివిధ వాహనాల్లో జెండాలు చేతపట్టిన కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో మీటింగ్‌కు వెళ్లారు. వాహనాలను శనివారం చిట్యాలలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, మారగోని ఆంజనేయులు, వనమా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కనగల్ నుంచి బయల్దేరుతున్న నాయకులు, కార్యకర్తలు

రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలి

చండూరురూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగం గా రైతులకు ఎలాంటి ఆంక్ష లు లేకుండా రుణమాఫీ రూ. 2లక్షలు మాఫీ చేయాలని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ అన్నారు. మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో శనివారం రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలి సంబరాలు నిర్వహించుకోవడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో రైతులు ఇరిగి రామలింగయ్య, గుణగంటి లింగయ్య, గడ్డం లింగయ్య, ఇరిగి అంజమ్మ, కొత్తపల్లి సావిత్రి, వెంకటమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు

నల్లగొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే నల్లగొండ జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుతో పాటు మెడికల్ కళాశాల, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టును ఒకే రోజు ప్రారంభించడంతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రా జెక్టుల పూర్తితో ఆయకట్టు సాగు పెరుగుతుందని, మెడికల్ కళాశాలతో విద్యారంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. 800 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో విద్యుత్ కొరత తీరనున్నట్లు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

శాలిగౌరారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబారిపేట గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నూనె శేఖర్‌కు అనూష (28)తో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా శేఖర్‌కు మానసిక ప్రవర్తన సరిగా లేదు. చికిత్సతో పాటు కుటుంబపోషణ కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియక అనూష మనస్థాపానికి గురైంది. జీవితంపై విరక్తి చెందిన ఆమె శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కడారి కొమరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ నజీరుద్దీన్ తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు



కేతేపల్లి : పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

కేతేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు చల్లా కృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు కట్టా శ్రవణ్, శ్రీనివాసయాదవ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కనగల్: మండలంలో మాజీ ఎంపీపీ కరీంపాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్, మాజీ సర్పంచులు కడారి కృష్ణయ్య, కారింగ్ జానయ్యగౌడ్‌తో పాటు ఇతర నాయకులను అరెస్టుచేసి దేవరకొండ పీఎస్‌కు తరలించారు.

మునుగోడు: మునుగోడు మండలానికి చెందిన పలువురు బీజేపీ నేతలను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు. సాయంత్రం సమయంలో వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్‌గౌడ్, సైదులు ముదిరాజ్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
3
ఆదివారం 8 డిసెంబరు 2024

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	175	198
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 21.4



నల్లగొండ సభకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు



ఫ్లోరైడ్ పీడను, మూసీ కాలుష్యాన్ని

తరిమికొడతాం

- ప్రాజెక్టులను అడ్డుకునేవారి సంగతి ప్రజలే చూసుకోవాలి
- నల్లగొండ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లా పోరాటాల చరిత్రకు పెట్టింది పేరు.. ఈ గడ్డ పేరు తలిచినా, ఈ గాలి పీల్చినా ఒళ్లు పులకరిస్తుంది.. అలాంటి గడ్డను పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ పీడని, మూసీ కాలుష్యాన్ని తరిమికొడతాం.. సాయుధ రైతాంగ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఏ ప్రజా ఉద్యమమైనా నల్లగొండ ముందుంది.. కొండా లక్ష్మణ్‌బాపూజీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, ధర్మభిక్షం వంటి యోధులు, శ్రీకాంతాచారి వంటి బిడ్డలు నడయాడిన నేల ఇది.. ఎందరో యోధులకు నిలయమైన ఈ జిల్లాను సస్యశ్యామలం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం.. అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన పూర్తిచేసి తీరుతామని, అడ్డుకునేవారి సంగతిని ప్రజలే తేల్చాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం వస్తే నల్లగొండ జిల్లా బాగుపడుతుందని భావించారని, కానీ సమైక్య రాష్ట్రంలో కంటే గడచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే ఎక్కువ వివక్షకు గురైందన్నారు. జిల్లాలో ఎస్ఎల్‌బీసీని పదేళ్లు పూర్తిగా పక్కనబెట్టారని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఫ్లోరైడ్‌పీడతోపాటు 3.50లక్షల ఎకరాలకు సాగునీరు, ఈ ప్రాంతాలకు తాగునీరు వచ్చేదన్నారు. వివక్షకు నిరసనగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 12కు 11 సీట్లలో భారీ మెజార్టీలతో కాంగ్రెస్ నేతలను గెలిపించారని, రెండు ఎంపీ సీట్లను అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. నల్లగొండ ఎంపీగా రఘువీర్‌ను దక్షిణ భారతదేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించారని, అందుకు కృతజ్ఞతలు అన్నారు. తమ ప్రభుత్వంలో జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికే నీటిపారుదలశాఖ బాధ్యత అప్పగించామని, ఆయన నేతృత్వంలో ఎస్ఎల్‌బీసీ మొదలు చిన్న ప్రాజెక్టుల వరకు అన్నింటినీ పూర్తిచేస్తున్నారని, నిధులను కూడా గ్రీన్ ఛానల్‌లో ఉంచి విడుదల చేస్తున్నామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల, డిండి లిఫ్టు, మూసీ ప్రక్షాళన అన్ని ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేస్తామన్నారు. రీజనల్ రింగురోడ్డు నిర్మాణం చేపడతామని, నల్లగొండకు ఔటర్ రింగురోడ్డు వెంకట్‌రెడ్డి నేతృత్వంలో మంజూరైందని పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాల కూడా మంజూరైందని, త్వరలో డెంటల్ కళాశాల కూడా ఇస్తామని పేర్కొన్నారు. నల్లగొండకు ఏది అడిగితే అది ఇవ్వడం ఇందిరమ్మ ప్రభుత్వంగా తమ బాధ్యతని పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి తామంతా జట్టుగా పనిచేస్తామన్నారు.

సీఎం పర్యటన సాగుతుండగానే జీవోలు విడుదల

నల్లగొండ జిల్లాలో సీఎం పర్యటన కొనసాగుతుండగానే

మిగతా 4వ పేజీలో...


యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్, తదితరులు

నా జన్మ ధన్యమైంది

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నార్కట్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం జాతికి అంకితం కావడంతో తన జన్మ ధన్యమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం పర్యటన ముగిసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు తన రాజకీయ స్వప్నంగా అభివర్ణించారు. రాష్ట్రంలో దశాబ్దకాలంలో మారిన రాజకీయ పరిణామాలతో ప్రాజెక్టు నిలిచిపోతే మనసు ఎంతో వేదనకు గురైందన్నారు. అంతకుముందు పైలాన్ స్తూపావిష్కరణ వద్ద కూడా సీఎం రేవంత్‌రెడ్డికి వెంకట్‌రెడ్డి మర్యాద పూర్వక నమస్కారం చేశారు. సీఎం కూడా కోమటిరెడ్డిని అభినందిస్తున్నట్టు ప్రతి నమస్కారం చేశారు.

సభ విజయవంతంతో జోష్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయిన సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభ విజయవంతం కావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నెలకొంది. ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో ప్రతిష్ఠాత్మక బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం, యాదాద్రిపవర్‌స్టేషన్‌లో తొలి యూనిట్‌లో విద్యుదుత్పత్తి, మెడికల్ కళాశాల భవనాలను సీఎం ప్రారంభించారు. వీటితోపాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యమ చరిత్ర, ప్రగతి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను, లక్ష్యాలను సీఎం వివరించడం సభికులను ఆకట్టుకుంది. ఉదయం నుంచే భారీగా జనం నియోజకవర్గాల నుంచి తరలివచ్చి కూర్చున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాలు ప్రారంభం కాగానే కార్యకర్తలు చప్పట్లతో కేరింతలు కొట్టారు. జిల్లా వ్యాప్తంగా జనసమీకరణ చేయడంతో నల్లగొండ పట్టణం కిక్కిరిసింది. అన్ని రోడ్లు వాహనాలతో నిండిపోయాయి. పట్టణంలో నలువైపులా, అన్ని రహదారులను సీఎం స్వాగత ఫ్లెక్సీలతో నింపేశారు. సీఎం ప్రసంగం యావత్తూ జిల్లా గొప్పదనాన్నిచాటుతూ సాగడంతో పాటు, జిల్లాకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటడం సభికుల్లో చర్చకు దారితీసింది. జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని, తమ పార్టీని ఆదరించిన ఈ జిల్లా రుణం తీర్చుకునేలా పనిచేస్తామని సీఎం సహా మంత్రులు ప్రకటించారు. మొత్తంగా సభ ఘనంగా జరగడం, జనం భారీగా హాజరవడంతో మంత్రి, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా కనిపించారు. ఇదిలా ఉండగా, విజయోత్సవ సభలో నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి తన ఆటపాటలతో అలరించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై, మంత్రి వెంకట్‌రెడ్డిపై ఆయన పాడిన పాటలు ఉత్సాహపరిచాయి.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈ నిబంధనలు

పాటించాల్సిందే

- పురుగులు ఉన్న బియ్యంతో వంట చేస్తే చర్యలు
- గురుకులాలు, పాఠశాలలు, హాస్టళ్లకు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



మోత్కూరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి వంటసిబ్బంది పాటించేలా ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీచేసింది. గురుకులాలు, కస్తూర్బా, హాస్టళ్లు, పాఠశాలల్లో భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. రాష్ట్రంలో పలు చోట్ల కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో పభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వంట సిబ్బంది నిబంధనలు పాటించేలా చూడాలని ఆయా పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది.

నిబంధనలు ఇవే...

- ఆహార పదార్థాలను తేమ లేని చోట, పొడి ప్రదేశంలో భద్రపర్చాలి. వంట గది ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలి.
- వంట చేసేటప్పుడు బియ్యం, ఉప్మారవ్వలో పురుగులు, బూజులాంటివి ఉంటే వాటితో వంట చేయకూడదు.
- కుళ్లిపోయిన, పుచ్చులు ఉన్న కూరగాయలతో కూరలు వండరాదు.
- కూరగాయలు తరిగే చాకులు, చాక్‌ప్యాడ్‌లు ఎప్పటికప్పుడు కడిగి శుభ్రం చేసుకోవాలి. కిచెన్‌లో వ్యర్థాలను ఏరోజుకారోజు వెంటనే తొలగించాలి.
- భోజనానికి అవసరమైన సరుకుల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండే సరుకులను నెలకోసారి, త్వరగా పాడయ్యే సరుకులను వారంలో మూడు సార్లు ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలి. కాంట్రాక్టరు నుంచి నాణ్యత లేని సరుకులు తీసుకోరాదు.
- వంటలకు రక్షిత మంచినీటిని వాడాలి. ఓవర్ హెడ్ ట్యాంకులు 15 రోజులకు ఒకసారి, సంప్‌లు నెలకు ఒకసారి శుభ్రం చేయించి, రిజిస్టర్‌లో రాయాలి.
- వంట సిబ్బంది వెంట్రుకలు రాలకుండా తలకు క్యాప్ ధరించాలి. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. మాస్కులు ధరించాలి. వంట సిబ్బంది సమయ పాలన పాటించాలి.
- మధ్యాహ్నం, రాత్రికి వంటలు ఎప్పటికప్పుడు వేర్వేరుగా చేయాలి
- ప్రిన్సిపాల్, డ్యూటీ టీచర్, మెస్ ఇన్‌చార్జి భోజనం విద్యార్థులకు వడ్డించే ముందు రుచి చూడాలి.
- విద్యార్థులకు వేడి భోజనం వడ్డించాలి.
- పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో వేర్వేరుగా రెండుఫుడ్ కమిటీలు ఏర్పాటు చేయాలి.
- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లు, వంట సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

ఆసరాగా ఉంటారనుకుంటే

- అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు
- ఈత రాక ఐదుగురు యువకుల మృత్యువాత
- ప్రాణాలతో బయటపడిన ఒక యువకుడు
- భూదాన్‌పోచంపల్లి మండలంలో ఘటన



ఆసరాగా ఉంటారనుకున్న కుమారులు మృత్యువాత పడడంతో ఆ కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. అప్పటిదాకా తమతో మాట్లాడిన పిల్లలు ఇక లేరని తెలిసి, వారి తల్లిదండ్రులు తల్లడిల్లిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. భూదాన్‌పోచంపల్లి మండలంలో శనివారం కారు చెరువులోకి దూసుకెళ్లడంతో ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు.


- భూదాన్‌పోచంపల్లి, భువనగిరిటౌన్

5

ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి

చేనేత జౌళిశాఖ ఏడీ ద్వారక్


నేతన్న బీమా చెక్కును అందజేస్తున్న చేనేత జౌళిశాఖ అధికారులు

మునుగోడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళిశాఖ ఏడీ ద్వారక్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని మునుగోడులో ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. త్రిఫ్ట్ పథకంలో మండలానికి చెందిన 500 మంది కార్మికులకు రూ. 3.50 కోట్లు, నేతన్న బీమా పథకంలో ఒక్కొక్కరికీ రూ. 5లక్షలు చొప్పున నలుగురు కార్మికులకు రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సదస్సులో ఏడీవో గోపాల్, చేనేత కార్మిక సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు చెరుకు సైదులు, చిలుకూరు మధు, పలివెల చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గుర్రం రాందాస్, కార్యదర్శులు చెరిపల్లి రాము, కర్నాటి రాజు, గంజి నరేందర్, సత్యనారాయణ, సత్తయ్య, మారయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టులది ఉజ్వల పోరాట చరిత్ర



పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల పోరాట చరిత్ర కమ్యూనిస్టు పార్టీలదని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరంతరం ప్రజల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదన్నారు. సీపీఐ వందేళ్ల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఈ నెల 30న ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సీపీఐ పోరాటాల ఫలితంగానే నేటి పాలకులు ప్రాజెక్టుల పనులు పూర్తిచేస్తున్నారని అన్నారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేసినందుకు అభినందనలు అన్నారు. ప్రాజెక్టులో కేటాయించిన విధంగా కిష్టాపురం ఎడమ కాల్వ ద్వారా మునుగోడులోని 10 గ్రామాలకు సాగునీరు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్ట్‌లకు అధిక నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు గురిజ రామచంద్రం, పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రావణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, ఆర్.అంజయ్యచారి, బొల్లుగి నర్సింహ, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జూలకంటి రంగారెడ్డి

సమస్యలు పరిష్కరించండి

సీఎంకు జూలకంటి వినతి

దామరచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి వినతిపత్రం అందజేశారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో డంప్‌యార్డులు జనావాసల మధ్య ఉండడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. వాటిని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, పరిశ్రమలతో భూములు కోల్పోయిన వారికి తక్షణమే ఉద్యోగాలు కల్పించి దామరచర్ల మండలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

మహిళల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

చిట్యాల, నల్లగొండ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండా అనురాధ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌తో పాటు నల్లగొండ మండలం కొత్తపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం 'ఆడపిల్లల భద్రత-మనందరి బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయలలో భాగమన్నారు. యువత ఆడపిల్లలకు రక్షణగా నిలవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆడపిల్లల భద్రత మనందరి బాధ్యత అని అన్నారు. యువతీ యువకులు సరైన అవగాహన లేక, సమాజంలో వస్తున్న పరిస్థితులు అర్థం చేసుకోలేక పక్కదారి పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఉపాధ్యాయులు పద్మజ, మంజుల, సైదానాయక్, శ్రీనివాస్, శైలజ, ఉమాదేవి, కవిత, నిర్మల, ప్రినిపాల్ చంద్రశేఖర్, సైదులు, కళావతి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ మండలంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ

తాగునీటికి తంటాలు

▸ త్రిపురారం మండలంలోని గ్రామాల్లో కొన్ని నెలలుగా సరఫరా నీరు ▸ ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకానికి గ్రహణం పట్టింది. పల్లెల్లో ప్రజలకు కొన్నినెలలుగా తాగు నీరందకపోయిన పట్టించుకునే వారు కరవయ్యారు. చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయి. ప్రణాళిక బద్ధంగా పైప్ లైన్లు లేకపోవడంతో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

(త్రిపురారం -ఆంధ్రజ్యోతి)

త్రిపురారం మండలం లోని చాలా గ్రామాలకు మిషన్ భగీరథ సరఫరా కాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధా నంగా మండలంలోని కంపసాగర్ గ్రామ పంచాయతీ కోమటిగూడెం, అంజనపల్లి గ్రామంతో పాటు దాని పరిధిలోని పాల్తీతండా సమస్య తీవ్రంగా ఉంది. కోమటి గూడెంలో 200 వరకు జనాభా ఉంది.. తాగు నీటి కోసం 5వేల నీటి నిల్వ సామర్థ్యం గల వాటర్ ట్యాంకును నిర్మించారు. కానీ అక్కడ నుంచి నీటి సరఫరా చేసే పైప్ లైన్ నిర్మాణం అధ్వానంగా ఉంది.. దాంతో చుక్క నీరు రావడం లేదు. ఇంటింటికీ వేసిన పైప్ లైన్ నాసిరకంగా ఉండటంతో ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి వెంట పైప్ లైన్ల మరమ్మతుల కోసం గుంత తీశారు.. ఎలాంటి పనులు చేపట్టకుండా ఆ గుంత ను వదిలేయడంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుమారు 6 నెలల నుంచి పూర్తి స్థాయిలో సరఫరా నిలిచి పోయింది. మొత్తం గ్రామానికి కలిపి ఇంచున్నర నీరు వచ్చే బోరు మాత్రమే దిక్కైయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు తాగునీటికి అగచాట్లు తప్పడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పొద్దస్తమానం తాగునీటి కోసం సమయం కేటాయించాల్సి రావడంతో కనీసం పనులకు వెళ్లడం కష్టంగా మారిందని కోమటిగూడెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు హడావుడి చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు వేడుకుంటున్నారు.



పాల్తీతండాలో వృథాగా ఉన్న వాటర్ ట్యాంకు

అంజనపల్లి గ్రామంతో పాటు దాని పరిధిలోని పాల్తీ తండాలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. అంజనపల్లిలో 2వేల జనాభా ఉండగా నాలుగు నెలలుగా తాగు నీటి సరఫరా నిలిచిపోయింది.. అధికారులను అడిగితే పైప్‌లైన్ల సమస్య ఉందని మరమ్మతు చేస్తామని నాలుగు నెలలుగా కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. పాల్తీతండాలో 300 మంది జనాభా ఉండగా తాగు నీటి అవసరాల కోసం ఓవర్ హెడ్ నిర్మించార. పథకం ప్రారంభమై నాలుగేళ్లయినా ఇప్పటివరకు చుక్క నీరు కూడా ట్యాంకుకు సరఫరా కాలేదని అధికారుల చుట్టు ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. తాగు నీరు సరఫరా లేకపోవడంతో శుద్ధ నీటిని నగదుతో కొనుగోలు చేయాల్సి వస్తుందని, పైప్‌లైన్ల సమస్యను గుర్తించి తాగు నీటి అందిం చాలని ప్రజలు కోరుతున్నారు. తాగు సరఫరాకు అధికార యం త్రాంగం చర్యలు తీసుకోవాలి.



పైప్‌లైన్ మరమ్మతు కోసం తీసిన గుంత

తాగు నీటిని సరఫరా చేస్తున్నాం

ప్రధాన పైప్ లైన్‌కు చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించాం.. నీటి సఫరా జరుగుతుంది. సమస్యలు ఉంటే గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తాం

-గోపాలకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ

విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది



తాగు నీటి సమస్య గురించి ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.. నాలుగు నెల లుగా చుక్క నీరు సరఫరా కావడం లేదు.. తాగు నీటి కోసం చాలా ఇబ్బందులు పడు తున్నాం.. అధికారులు స్పందించి తాగు నీ టి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

-మడుపు శ్రీనివాస్,అంజనపల్లి

ట్యాంకు నిర్మించి వదిలేశారు..



మా గ్రామంలో ఐదేళ్ల క్రితం ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నీటి సరఫరా కాలేదు. తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు విన్న వించినా పట్టించుకోవడం లేదు..

-పాల్తీ సునీల్, పాల్తీతండా

విజయోత్సవ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కొండమల్లేపల్లిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, కొండమల్లేపల్లి డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో నల్లగొండలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులు, వాహనాలకు దేవరకొండ, కొండమల్లేపల్లిలలో ఎమ్మెల్యే బాలునాయక్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 10వేల మంది వరకు నల్లగొండ బహిరంగసభకు తరలి వెళ్తున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు సిరాజ్ ఖాన్, డాక్టర్ వేణుధర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్ నాయకులు ఉన్నారు. కొండ మల్లేపల్లి నుంచి తరలి వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఊట్కూరి వేమ న్‌రెడ్డి, నాయకులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సొంత వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

చింతపల్లిలో

● చింతపల్లి : నల్లగొండ జిల్లా కేంద్రంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన బహిరంగ సభకు శనివారం చింతపల్లి మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.
ఈ సంద ర్భంగా మాజీ ఎంపీపీ కొండూరి భవానిపవన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, అంగిరేకుల గోవర్ధన్, ఊరే లక్ష్మణ్, మాస భాస్కర్, మద్దెల కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన బీజేపీ నాయకులు

బీఆర్ఎస్, బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్

మాడ్గులపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు తమయే అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారం భిస్తూ కేసీఆర్‌ను, కేటీఆర్‌ను తిట్టడం సిగ్గుచేటన్నారు. సీఎం వస్తున్నారని ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించి స్కూల్ బస్సులను వాడుకొని విద్యార్థులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు సుధాకర్, అఫ్జల్, మాజీ ఎంపీపీ సలహాదారుడు పోకల రాజు ఉన్నారు.

● కొండమల్లేపల్లి : మండలంలోని పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ యువ మోర్చా జిల్లా కార్య దర్శి భూతరాజు కుమార్ మాట్లాడుతూ అరెస్టులు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అరెస్టుయిన వారిలో పందు చందు, నవీన్, రాహుల్, శివ, వినయ్ తదితరులున్నారు.

● చింతపల్లి : మండలంలోని బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమోని రాములు మాట్లాడుతూ ఎన్ని కల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోస పూరితమైన ప్రకటనలు చేయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన వారిలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్, సైదులు, శ్రీశైలం, అభినవ్ ఉన్నారు.

'దైవచింతనతోనే మానసిక ప్రశాంతత'

దేవరకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని పెద్దతండా ఆంజనేయస్వామి పడిపూజలో ఆయన పాల్గొని పూజలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమావత్ నర్సింహ, రమావత్ కిష్టునాయక్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాంసింగ్‌నాయక్



దేవరకొండ, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవర కొండ పట్టణానికి చెందిన కొర్ర రాంసింగ్ 5,700 ఓట్లతో ఎన్నికయ్యారు. సెప్టెంబర్‌లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికలో ఆయన్ను ఎన్నుకున్నారు. రాంసింగ్ దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ముఖ్య అనుచరుడిగా ఉంటూ ఎన్ఎస్‌యూఐలో జాతీయ కార్యవర్గ సభ్యు డిగా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్య దర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా రాంసింగ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతల పూడ్చివేత



రహదారిలో గుంత పూడుస్తున్న స్థానికులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం ఉస్మానియా మసీదు సమీపంలో రహదారి పై ఏర్పడిన గుంతలను సీపీఎం నాయకుడు అయూబ్ సొంతఖర్చులతో పూడ్చి వేయించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారి కంకర తేలి ఉందని, వర్షం కురిసి బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులను పలుమార్లు విన్నవించినా ఫలి తం లేకపోవడంతో సొంత ఖర్చుతో మిత్రులతో కలిసి మరమ్మతు చేపట్టినట్లు చెప్పారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఏబీవీపీ

కొండమల్లేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి కార్తీక్ అధికారులను కోరారు. శనివారం ఏబీవీపీ నాయకులు కొండ మల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. ఆయన వెంట ఏబీవీపీ నాయకులు శివ, చరణ్, అభి, వెంకటేష్, సాయి, దినేష్ తదితరులున్నారు.

ఆటో డ్రైవర్లకు జీవన భృతి ఇవ్వాలి



దేవరకొండలో ఆటోలు బంద్ చేసిన నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

దేవరకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు నెలకు ప్రభుత్వం రూ.15వేల జీనవ భృతి ఇవ్వాలని ఆటో యూనియన్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ జానిబాబా డిమాండ్ చేశారు. శనివారం ఆటోలు బంద్ చేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లకు భరోసా పథకం అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, నగేష్, జాని, గోపి, రాము పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి



టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న వస్కుల కృష్ణయ్య

దేవరకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీని బలోపేతం చేసి పూర్వ వైభవం తేవాలని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు వస్కుల కృష్ణయ్య కోరారు. శనివారం దేవరకొండలో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును పూర్తిచేసి హైదరాబాద్‌తో పాటు జంట నగరాలకు సాగు, తాగునీరు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందని గుర్తు చేశారు. రూ.100 సభ్యత్వం తీసుకుంటే రూ. 5 లక్షలు బీమా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గార్లపాటి శ్రీనివాస్, రామాచారి, రాజేష్, దొడ్డి శ్రీను, మధు, కనకమ్మ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలం పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ప్రథమ హనుమత్ గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించారు. మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, సింధూర అభిషేకం, మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచకం, అఖండ దీపారాధన, కంకణ ధారణ నిర్వహించారు. మద్దిమడుగు పీఠాధిపతి జయరాం గురుస్వామి పర్యవేక్షణలో రాయప్రోలు మురళీ శర్మ గురుస్వామి, శ్రీ మహేశ్వరం శివయ్య చారి, డేర జయప్రకాశం శర్మ పూజా కార్యక్రమాలు, మహా యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణాహుతి(మహానివేదన) గురుస్వామితో నిర్వహించారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో హనుమాన్ మాలధారులు హాజరయ్యారు. అనంతరం దాతల సాయంతో అన్నదానం నిర్వహించారు. యజ్ఞానికి సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు రమేష్, కేతావత్ మూనా, బాలకృష్ణ, పరి పూర్ణాచారి, పరమేష్ పాల్గొన్నారు.

గణిత ప్రతిభ పాటవ పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గణిత ఫోరం కొండమల్లేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభపాటవ పరీక్షలు నిర్వహించారు. ఆంగ్ల మాధ్యమ విభాగంలో కొండమల్లేపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బి.స్పందన ప్రథమస్థానం, ఎం.రామకృష్ణ ద్వితీయ స్థానంలో నిలువగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన బి.స్నేహ తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే తెలుగు మీడియం విభాగంలో కొండమల్లేపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రేమ్‌కుమార్ ప్రథమ స్థానం, జాల శ్రీలత ద్వితీయ స్థానం, పి.సతీష్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఇన్‌చార్జి హెచ్ఎం జాన్‌నాయక్ బహుమతులు ప్రదానం చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ



పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ వనమాల దుర్గాప్రసాద్ కంప్యూటర్లను బహూకరించారు. అమెరికాలోని అడ్వాన్స్ ఆటో పార్ట్స్ కంపెనీ డైరెక్టర్ అయిన దుర్గాప్రసాద్ మిత్రుడు సురేష్ చామలకొండ ఇటీవల మరణించాడు. అతడి జ్ఞాపకార్థ రూ. 4 లక్షల విలువైన 10 కంప్యూ టర్ల తో పాటు డీజీ స్ర్కీన్‌ను అందజేశారు. చిన్ననాటి మిత్రులు వికాస్, లక్ష్మీ, మాధవి, మమత, సాంబ, సైదిరెడ్డి, రమేష్, సురేందర్, శ్రీను తదితరుల సహకారంతో ఏర్పాటు చేశారు. కంప్యూటర్ రూమ్‌ను పట్టణ ప్రముఖులు, రైస్‌మిల్లర్ రంగా రంజిత్ పాఠశాల హెచ్ఎం కరుణాకర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సునీత, ప్రభాకర్, శివ, నెహ్రూ, సైదులు, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



దేవరకొండలో రిలే దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ కోరారు. దేవరకొండ బస్టాండ్ వద్ద చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు 12నెలల పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందజేయాలని ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రములో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, జానిబాబా, ఇలి యాజ్, బాలు, మధు, సంఘం రాష్ట్ర అధ్య క్షుడు క్రాంతి, దారం శ్రీను పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : ఉద్యోగ భద్రత కల్పిం చాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ మండల అధ్యక్షుడు మహేశ్వరపు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పనికి తగ్గ సమాన వేతనం అందించాలని, ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేయాలన్నారు. ఈ నెల 9వ వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా మన్నారు. కార్యక్రమంలో ఉమాశంకర్, నిరంజన్, హారిక, నాగేందర్, మనోహర్, వంశీకృష్ణ, రేణుక ఝాన్సీ పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : మండల వనరుల కేంద్రం ఎదుట శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎంఈవో వెంకటయ్యకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ నెల 10 నుంచి సమ్మె బాట పడుతున్నట్లు సమగ్ర శిక్షా ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమం లో మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జహంగీర్ పాషా, గోవింద్, ప్రేమ్‌సాగర్, కేజీబీవీ ఉద్యోగులు కల్యాణి సుజాత, లక్ష్మీ, శకుం తల, స్వప్న, సావిత్రి, పావని, అశ్విని , నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టబోయిన శ్రీనివాస్ యా దవ్ ప్రభుత్వాన్ని కోరారు కొండమల్లేపల్లిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలియజేశారు.



మిర్యాలగూడలో..

ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం : టీఎన్జీవో



సాగర్ పట్టణ అధ్యక్షుడిని సన్మానిస్తున్న జిల్లా కార్యవర్గం

నాగార్జునసాగర్, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): ఉద్యోగుల హక్కుల కోసం నిరం తరం పోరాడుతామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో జయ శంకర్ భవన్‌లో శనివారం నాగార్జున సాగర్ యూనిట్ అధ్యక్షుడు జానపాటి రాములు అధ్యక్షతలో ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాగర్ నుంచి బదిలీపై వెళ్లిన ఉద్యోగుల స్థానం లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు దశరథ, వెంకటయ్య, దుర్గయ్య, మనోజ్ ప్రదీప్, సైదులు, మధుసూదనాచారి, రవీందర్‌రెడ్డి, కిరణ్, రణదేవ్, అజీమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నార్కట్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు సమీపంలో గల శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వ హించారు. ఆలయ అర్చకుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ సహార్చకు ల యాజ్ఞీకంలో జరిగిన ఈ కల్యాణతంతు వేడుకను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నూకల నర్సింహారెడ్డి, తేరటుపల్లి హనుమంతు, జ యారపు రామకృష్ణ, కొండూరు వెంకటేష్, పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వ ద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో శనివా రం సుబ్రమణ్యస్వామి షష్టిని పురస్కరించుకు ని అర్చకులు సుబ్రమణ్యస్వామికి విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. చీరసారె ఒడిబి య్యం, బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.